క్లుప్తంగా

అధునాతన పద్ధతిలో బోధించాలి



నవాబుపేట: విద్యార్థులకు అధునాతన పద్ధతిలో బోధించడంతో పోటీ ప్రపంచంలో మరింత ముందుకెళ్తారని ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం మండలంలోని కాకర్లపహాడ్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై బోధన చేసి వివిధ రకాల ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు ప్రణాళిక ప్రకారం బోధన చేయాలని సూచించారు. అనంతరం పాఠశాలకు 5 కంప్యూటర్‌లు, వైఫై సౌకర్యం కల్పిస్తానని ఏఎంఓ హామీ ఇచ్చారు. ఆయన వెంట సీఆర్‌పీ జనార్దన్, హెచ్ఎం శ్రీనివాస్, విజయ్‌కుమార్, రవీందర్ తదితరులు ఉన్నారు.

సద్బుద్ధితో చదువుకోవాలి



గండేడ్: విద్యార్థులు సద్బుద్ధితో చదువకోవాలని హెచ్ఎం అరుణాదేవి పేర్కొన్నారు. శుక్రవారం గండేడ్ మండలంలోని చిన్నవార్వాల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచితనోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న కార్పొరేట్ తరహా వసతులను విద్యార్థులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణయ్య, మల్లేశ్, వెంకటయ్య, సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు పెంచాలి



దేవరకద్ర రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషిచేయాలని ఎంఈఓ బలరాం అన్నారు. శుక్రవారం హజీలాపూర్, లక్ష్మీపల్లి, బస్వాయపల్లి పాఠశాలలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయల బోధనా తీరు, విద్యార్థుల కనీస అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించి విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం అమలుకు సంబంధించి ఎఫ్ఆర్ఎస్, ఎండీఎం యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

20న దివ్యాంగుల సమావేశం

భూత్పూర్: జిల్లా కేంద్రంలోని క్రౌన్‌గార్డెన్‌లో ఈనెల 20న దివ్యాంగుల సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి భిక్షపతి, దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు తెలిపారు. శుక్రవారం భూత్పూర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు ఫించన్ పెంచాలని, ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు చేపట్టే సమావేశానికి విధిగా హాజరుకావాలని కోరారు. కార్యమ్రంలో దివ్యాంగుల జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి జైపాల్‌రెడ్డి, మండలాధ్యక్షుడు యాదయ్య, సత్యనారాయణ, గట్టన్న తదితరులు ఉన్నారు.

డీకే అరుణను విమర్శించే స్థాయి జీఎంఆర్‌కు లేదు

పాలమూరు: దేవరకద్ర ప్రజలు నమ్మి ఓట్లు వేస్తే.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడం చేతకాని ఎమ్మెల్యే జీఎంఆర్ ఎంపీ డీకే అరుణను విమర్శించే స్థాయి నీదికాదని బీజేపీ నేత ప్రశాంత్‌రెడ్డి అన్నారు. జిల్లా బీజేపీ కార్యాలయంలో శుక్రవారం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడారు. కేంద్రం ఇచ్చిన నవోదయ పాఠశాలను దేవరకద్రలో ఎందుకు నిర్మించారని అడగడం సరికాదని, నీ స్వార్థం వల్ల సమీకృత పాఠశాల భవనం మదనాపురంలో నిర్మించడంతో నియోజకవర్గ ప్రజలు ఇబ్బందులు పడక తప్పదన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ కోసం కష్టపడింది ఒకరు అయితే అధికారం నువ్వు అనుభవిస్తున్నావని ఆరోపించారు.

■ జిల్లా కేంద్రంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో మక్తల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అజిత్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు కార్యకర్తలు శుక్రవారం ఎంపీ డీకే అరుణ సమక్షంలో బీజేపీలో చేరారు.

■ పాలమూర్‌లోని అప్పన్నపల్లి నుంచి చిన్నదర్పల్లి వరకు బైపాస్ రోడ్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతులిచ్చిన సందర్భంగా బీజేపీ పాలమూరు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం తెలంగాణ చౌరస్తాలో ప్రధాని మోదీ, రవాణా శాఖమంత్రి నితిన్ గడ్కరీ, ఎంపీ డీకే అరుణ చిత్రపటాలకు పాలభిషేకం చేశారు.

ఐదేళ్లుగా కంకరకే పరిమితం!



అర్ధాంతరంగా నిలిచిన అన్నారెడ్డిపల్లి రోడ్డు పనులు

- మారుమూల తండాలు, పల్లెలకు రోడ్డు సౌకర్యాలు కరువు
- ప్రధానదారుల్లో నిర్మాణానికి కంకరవేసి వదిలేసిన కాంట్రాక్టర్లు
- రాకపోకలకు ఇక్కట్లు ఎదుర్కొంటున్న వాహనదారులు

మహమ్మదాబాద్: కొత్తగా సాధించుకున్న తెలంగాణలో అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందని ఎంతోమంది మారుమూల గ్రామాల ప్రజలు ఆశపడ్డారు.. ఎదురు చూశారు. తెలంగాణ సాధించుకుని పదేళ్లు గడిచిపోతున్నా మారుమూల ప్రాంతాల రోడ్లకు మోక్షం కరువైంది. తండాలు, మారుమూల పల్లెలకు రోడ్లులేక ప్రజలు వాహనాల రాకపోకలకు ఇక్కట్లకు గురవుతున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా తండాలు, పల్లెల రోడ్డు సౌకర్యాలు మారడంలేదు. ఎన్నో ఏళ్లుగా రోడ్డు సౌకర్యాలు లేక రోడ్డు ఏర్పాటు చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులను కోరుతున్నా ఫలితం లేకపోయింది.

మండల వ్యాప్తంగా..

మంగంపేట్‌తండా, షేక్‌పల్లితండా, కొలిమికుచ్చ తండా, సంగాయపల్లితండా, పెద్దతండా, అన్నారెడ్డిపల్లితండాతోపాటు బండమీదిపల్లి, రాగారిపల్లి, మఠంలపల్లి, వడ్డెగుడిసెలు, జగ్గంపల్లి, ఎల్కిచెర్వు తండా గువ్వోనికుంటతండా, కుచ్చెమీదితండా, కన్కెలకుంట, గుంగ్యాతండాలకు ఇప్పటికీ రోడ్డు సౌకర్యంలేక ఎన్నో అవస్థలు పడుతున్నారు. వర్షం కురిసిందంటే చాలు మట్టిరోడ్డుపై వాహనాలు వెళ్లలేక బురదలో తంటాలు పడుతూ దాటాల్సిందే.

కంకర వేసి వదిలేసిన కాంట్రాక్టర్లు

మండలంలోని అన్నారెడ్డిపల్లితండాకు ఐదేళ్ల కిందట ఓ కాంట్రాక్టరు తారురోడ్డు వేయడానికి కంకర వేసి వదిలేశాడు. అప్పటినుంచి రోడ్డుపై వాహనాలు వెళ్లడానికి నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రధానమైన మరోతండా మంగంపేట్ తండాకు నిధులు మంజూరై రెండు కిలోమీటర్ల మేర తారు రోడ్డు వేయగా మరోరెండు కిలోమీటర్లు కంకరవేసి వదిలేయడంతో నిత్యం వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు.

కలెక్టరేట్ ముట్టడిస్తాం

మండలకేంద్రానికి ప్రధానమైన అన్నారెడ్డిపల్లి రోడ్డు ఐదేళ్ల క్రితం బీటీరోడ్డు మంజూరు కావడంతో నిర్మాణం చేపట్టారు. కంకరవేసి మధ్యలోనే వదిలివెళ్లిపోయాడు కంట్రాక్టరు. కంకరరోడ్డుపై వాహనాలు వెళ్లలేక ఎన్నో అవస్థలు పడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.

– రఘునాయక్ అన్నారెడ్డిపల్లి తండా

వారంరోజుల్లో ప్రారంభిస్తాం

అన్నారెడ్డిపల్లి తండా రోడ్డు నిర్మాణం కాంట్రాక్టర్ మధ్యలోనే వదిలేయడంతో ఉన్నతాధికారులు సంబంధిత కాంట్రాక్టరుతో మాట్లాడారు. వెంటనే రోడ్డునిర్మాణం ప్రారంభిస్తాం. మంగంపేట్‌తండా రోడ్డు ట్రైబల్ వెల్ఫేర్‌వారు చూస్తున్నారు. నిర్మాణం పూర్తయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

– ముతీమ్, పంచాయత్‌రాజ్ ఏఈ

రీటెయినింగ్ వాల్ కూల్చివేత



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలో సిగ్నల్‌గడ్డపై జాతీయరహదారి రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తహసీల్దార్ కార్యాలయం, భూసార పరీక్షకేంద్రం వద్ద నిర్మిస్తున్న రీటెయినింగ్ వాల్‌ను కూల్చివేస్తున్నారు. రోడ్డుకన్నా వాల్ ఎత్తుకావడంతో దానిని డ్రిల్ సహాయంతో మూడు రోజులుగా తొలగిస్తున్నారు. మొదటినుంచి జాతీయ రహదారి విస్తరణ పనులు ఇష్టారాజ్యంగా చేస్తున్నారన్న విమర్శలున్నాయి. రీటెయినింగ్ వాల్ నిర్మాణంలోనూ అలాగే వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రీటెయినింగ్ వాల్ ఎత్తుకావడంతో తహసీల్దార్ కార్యాలయం లోపలకు అవుతుందని పట్టణ ప్రజలు అభిప్రాయాలు వ్యక్తం చేశారు.

ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలి



గండేడ్: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని లింగాయిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులు ఇళ్లను పనులు వేగవంతం చేస్తే బిల్లులు కూడా సకాలంలో దశల వారీగా పొందవచ్చన్నారు. జక్లపల్లిలో పీఎం జన్‌మన్ పథకం ద్వారా చెంచులకు మంజూరైన ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక సర్వే కొనసాగుతున్నది. ఈ సర్వేను ఎంపీడీఓ పరిశీలించి సర్వే పక్కాగా చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రవి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



దేవరకద్ర: మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం జరిగిన డ్రైడే కార్యక్రమాలను కమిషనర్ నరేశ్‌బాబు, ఈవో సీత్యానాయక్ పరిశీలించారు. ఆరోగ్య సిబ్బంది, ఆశ వర్కర్ల ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి నిల్వనీటిని పారబోయడం, గుంతల్లో మలిచిన వర్షం నీటిలో దోమల నివారణ మందులు చల్లించారు. బల్సుపల్లిలో తిరిగి మురుగు కాల్వలు, రోడ్లను పరిశీలించారు. ఇంటితోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని కోరారు. చెత్తాచెదారం లేకుండా నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని దీని వల్ల దోమలను నివారించ వచ్చని ప్రజలకు వివరించారు.

'లేని పోస్టులో ఎంఈఓ కొనసాగడం అక్రమం'

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మహబూబ్‌నగర్ ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్ పట్టణ విద్యాశాఖ అధికారిగా కొనసాగడం అక్రమమని ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమేశ్, నాగరాజు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఎక్కడా లేనివిధంగా మహబూబ్‌నగర్ పట్టణ ప్రాంత ఎంఈఓగా చలామణి అవుతూ లేనిపోస్టుకు దస్త్రాన్ని తయారు చేయించారని ఆరోపించారు. హైదరాబాద్‌తోపాటు ప్రతి జిల్లా కేంద్రంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ పేరుతో పోస్టు ఉంటుందని, ఈ పోస్టు ఖాళీగా ఉన్నప్పటికీ ఎంఈఓ పోస్టును జిల్లా, రాష్ట్ర విద్యాశాఖ అధికారులు మార్పు చేశారని, వెంటనే దాన్ని రద్దు చేయాలని, దానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు కిశోర్‌కుమార్, శ్రీనివాసులు, చంద్యా, ఆంజనేయులు, దివాకర్, హరిచందర్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణస్వామి ఆశయాలను కొనసాగించాలి

- బాలల హక్కుల కమిషన్ చైర్ పర్సన్ సీతా దయాకర్‌రెడ్డి



నివాళులర్పించిన సీతా దయాకర్‌రెడ్డి

చిన్నచింతకుంట: దివంగత కార్మిక సంఘం నాయకుడు నారాయణ స్వామి ఆశయాలను ప్రతిఒక్కరూ కొనసాగించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నారాయణ స్వామి వర్ధంతి సందర్భంగా మండలంలోని అమ్మాపూర్‌లో విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నారాయణ స్వామి కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పలువురు ఉన్నారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



బుచ్చన్నను పార్టీలో చేర్చుకుంటున్న ఎమ్మెల్యే జీఎంఆర్

అడ్డాకుల: ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రానికి చెందిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు బుచ్చన్నయాదవ్, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్‌యాదవ్, బీఆర్ఎస్‌కు చెందిన టంకరి వెంకటేశ్, మన్నెంకొండ, సునీల్, రత్నం, యాకూబ్, వీరేశ్, గొల్లబాబు, రాములుయాదవ్ ఆపార్టీలను వీడి సీసీకుంట మండలం దమగ్నాపూర్‌లో ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని చెప్పారు. పాత, కొత్త నాయకులు, కార్యకర్తలు కలిసి మెలిసి పార్టీ కోసం పని చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు శ్రీహరి, విజయమోహన్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి, భీమన్నయాదవ్, బసదీశ్వర్, సయ్యద్‌షఫీ, వేఘనాథ్ తదితరులు ఉన్నారు.

రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలి

- జిల్లా సహకార అధికారి శంకరాచారి



రాచాలలో సభ్యత్వాలను అందజేస్తున్న జిల్లా సహకార అధికారి శంకరాచారి

అడ్డాకుల: ప్రభుత్వం వ్యవసాయరంగం అభివృద్ధికి అందిస్తున్న ప్రోత్సాహకాలను వినియోగించుకుని రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా సహకార అధికారి శంకరాచారి అన్నారు. మండలంలోని రాచాలలో శుక్రవారం సింగిల్‌విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి అధ్యక్షతన రైతులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సహకార శాఖ ఆధ్వర్యంలో రైతుల సంక్షేమానికి నూతనంగా ఏర్పాటు చేసిన రైతు ఉత్పత్తిదారుల సంఘంలో అన్నదాతలు చేరి సభ్యత్వాలను పొందాలని సూచించారు. పీఏసీఎస్ సభ్యత్వంతో సంబంధం లేకుండా భూ యాజమానులైన రైతులు రూ.2వేలు చెల్లించి సంఘంలో సభ్యులుగా చేరాలని చెప్పారు. మండలంలోని 750మంది రైతులతో సమిష్టి భాగస్వామ్యం కింద రైతుల బృందం రూ.15లక్షలను జమ చేస్తే కేంద్ర ప్రభుత్వం మరో రూ.15లక్షలను జమ చేస్తుందని తెలిపారు. దీనిద్వారా వ్యవసాయ పరికరాలు, రైస్‌మిల్లులు, రైతులకు అవసరమైన యంత్రాలను ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పారు. వాణిజ్య పంటలను సాగు చేయడం ద్వారా రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు కేంద్రం ఈ పథకాన్ని తీసుకొచ్చిందని వివరించారు. ఇదిలా ఉండగా అవగాహన సదస్సు వద్ద సుమారు 50 మంది రైతులు రూ.2వేలను చెల్లించి సభ్యత్వాలను పొందినట్లు సింగిల్‌విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఆడిట్ అధికారి టైటస్‌పాల్, ఏఓ బ్యూలా, సీఈఓ వెంకటయ్యగౌడ్, విండో డైరెక్టర్లు బుచ్చన్నగౌడ్, కృష్ణయ్య, చంద్రశేఖర్, కొండమ్మ, వీబీరాజు, పులిందర్, పీఏసీఎస్ సిబ్బంది రాఘవేంద్ర, మల్లేశ్, చక్రపాణిరెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బీసీ రిజర్వేషన్‌ను జీర్ణించుకోని బీఆర్ఎస్



మాట్లాడుతున్న జిల్లా ఓబీసీ చైర్మన్ తిరుపతి

రాజాపూర్(బాలానగర్): బీసీ సమాజానికి 42రిజర్వేషన్‌ను బీఆర్ఎస్ నాయకులు జీర్ణించుకోలేకపోవడంతోపాటు బీసీలపై దొంగవైఖరి అవలంభిస్తున్నారని ఓబీసీ జిల్లా చైర్మన్ తిరుపతి అన్నారు. శుక్రవారం బాలానగర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి బీసీలకు 33శాతం రిజర్వేషన్ కల్పించారని.. దీన్ని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 23శాతానికి తగ్గించి బీసీలకు తీరని న్యాయం చేశారని ఆరోపించారు. నాడు కేసీఆర్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్ భారీగా తగ్గించినప్పుడు నోరు మెదపని బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఇందిరా పార్కు వద్ద ధర్నాలే నిషేధించిన బీఆర్ఎస్ కాంగ్రెస్ ప్రజాపాలనలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేయడం హస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం దళిత ముఖ్యమంత్రిని చేస్తామని, మైనార్టీలకు 12శాతం రిజర్వేషన్‌లు కల్పిస్తామని మోసం చేసిందన్నారు. రెండు పర్యాయాలు అధికారంలో ఉన్నప్పుడు బీసీలు గుర్తురాని కవితకు బీసీలపట్ల మాట్లాడే అర్హత లేదన్నారు. సమావేశంలో ఓబీసీ మండల చైర్మన్ యాదయ్య, గోవర్ధన్, లక్ష్మణ్, శివ, సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి విడా వీఎక్స్2 ఎలక్ట్రిక్ స్కూటీ



స్కూటీ మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న సిబ్బంది

పాలమూరు: హీరో కంపెనీ నుంచి అధునాతనంగా మార్కెట్‌లోకి వచ్చిన సరికొత్త ఎలక్ట్రిక్ స్కూటర్ విడా వీఎక్స్2ను శుక్రవారం పట్టణంలోని అశ్విని ప్రీమియం షోరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షోరూం యాజమాని దిలీప్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ వాహనంలో ఎల్ఈడీ ల్యాంపులు అమర్చడం జరిగిందని, 4.3ఇంచుల డిజిటల్ టీఎఫ్‌టీ మీటర్ కలిగి ఉండడం, దీనికి బ్లూటూత్ కనెక్టివిటీతో జీపీఎస్ నావిగేషన్ అందుబాటులో ఉందన్నారు. దీని ఐడీసీ పరిధి 142కిలోమీటర్లు, ఆరు కిలోవాట్ల మోటార్ శక్తి కలిగి ఉంటుందన్నారు. విడివిడిగా తీసిపెట్టుకోవడానికి రెండు ప్రత్యేక బ్యాటరీలు, 62నిమిషాల్లో 80శాతం ఛార్జింగ్ అవుతుందన్నారు. గంటకు 80కిలోమీటర్ల వేగం ఉంటుందన్నారు. ఎక్స్‌షోరూం ధర రూ.84వేల నుంచి 99వేల వరకు ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ కిరణ్‌కుమార్, షోరూం మేనేజింగ్ భాగస్తుడు అశిష్, కంపెనీ మేనేజర్లు ప్రదీప్, గేష్, సత్యగోతి, అతీఫ్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలిస్తేనే గ్రామాల అభివృద్ధి

- పాలమూరు ఎంపీ డీకే అరుణ
- బొక్కలోనిపల్లిలో ఆర్ఓ ప్లాంటు ప్రారంభం



బొక్కలోనిపల్లిలో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ డీకే అరుణ

మహబూబ్‌నగర్ రూరల్: రాబోయే రోజుల్లో గ్రామాలు మరింత అభివృద్ధి చెందాలంటే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఎంపీ డీకే అరుణ అన్నారు. మండలంలోని బొక్కలోనిపల్లిలో రూ.7లక్షలతో సీఎస్సార్ నిధులతో నిర్మించిన ఆర్వో ప్లాంట్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం సీతారామాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వంతో ఒక్క పైసా లేదని, ఓట్ల కోసం కాంగ్రెస్ నేతలు చెప్పే మాయ మాటలు నమొద్దన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలుగా బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే కేంద్రం నిధులతో గ్రామాల అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. గ్రామాల్లో జరిగే ప్రతి అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వమే పైసలు ఇస్తుందని తెలిపారు. అలాగే బండమీదిపల్లి శివారులోని సాందీపని ఆవాసంలో వెంకట సుబ్బయ్య వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన 8కేవీ సోలార్ పవర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. సాందీపని ఆవాసం వెనుక ప్రహరిగోడ నిర్మాణానికి నిధులు, బస్సు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు వీరబ్రహ్మచారి, మండల ఇన్‌చార్జి పాండురంగారెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు గంగన్న, ప్రధాన కార్యదర్శులు రాఘవేందర్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మహేశ్‌గౌడ్, నాయకులు రాజుగౌడ్, జాం శ్రీనివాసులు, శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముందుగా గుర్తిస్తే కలుపు నివారణ సులువు



కొల్లూర్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న నిర్వాహకులు

నవాబుపేట: మొక్కజొన్న పంటలో కలుపు నివారణ ముందుగా గుర్తించి చర్యలు చేపడితే నివారణ చాలా సులువని ఏరియా మేనేజర్ అనిల్‌కుమార్ సూచించారు. శుక్రవారం మండలంలోని కొల్లూర్‌లో రైతులకు మొక్కజొన్న పంటలో దిగుబడులు, కలుపు తదితర తెగుళ్ల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇక్కడి పంట పొలాల్లో వరి తర్వాత ఎక్కువ శాతం మొక్కజొన్న పంటలు వేసేందుకు అనువుగా ఉన్నాయని.. అందుకే రైతులు వాటిపై దృష్టిపెట్టాలని సూచించారు. ప్రధానంగా మొక్కజొన్న పంటలకు కలుపు తొలగింపునకు ఎరేజ్ స్ట్రాంగ్, 15 రోజుల అనంతరం రజర్‌ను వాడాలని సూచించారు. ఈ సందర్భంగా నాగార్జున కంపెనీ వారు సాగులో రైతులు వివిధ రకాల ప్రశ్నలు వేసి వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు రఘు, రాజు, యాదయ్య, మేనేజర్ కిషోర్, కార్యక్రమ నిర్వాహకులు రవికిరణ్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

ఉత్తరాది మఠంలో ప్రత్యేక పూజలు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం ప్రమోదగిరి ఉత్తరాది మఠంలో పీఠాధిపతులు శ్రీసత్యాత్మతీర్థ శ్రీపాదులు శుక్రవారం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. క్షీరాభిషేకం, మహామంగళహారతి పూజలు నిర్వహించారు. అనంతరం సౌరభదాస విద్యాలయం నిర్వహించిన అన్నివర్గాల పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికి స్వామిజీ ప్రశంసాపత్రాలు అందజేశారు. భక్తులకు ఫల మంత్ర అక్షింతలు అందించారు. కార్యక్రమంలో ఉత్తరాదిమఠం నిర్వహణ అధికారి జోషి ఆనందాచార్యులు, మేనేజర్ ప్రశంతాచార్యులు పాల్గొన్నారు.

బడుల్లో వసతులు కల్పించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వ బడుల్లో పూర్తిస్థాయిలో వసతులు కల్పించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నారాయణమ్మ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలలను సందర్శించిన ఆమె వసతులపై మాట్లాడారు. ఇటీవల ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెరగడం శుభపరిణామమని, అందుకు తగ్గట్టుగా మౌలిక వసతులు కల్పించాలని, అవసరమైన చోట ఉపాధ్యాయులను నియమించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీలను విడుదల చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహమూద్, నవీన్, ఆశప్ప, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలి

నవాబుపేట: గ్రంథాలయాలను మరింత అభివృద్ధి చేసి వాటిని ప్రజలకు మరింత చేరువ చేయాలని ఎంపీడీఓ జయరాంనాయక్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పుస్తకాలు తదితర వాటిని పరిశీలించారు. రైతులు, యువతకు కావాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ నసీఆర్ అహ్మద్, ఏపీఓ జ్యోతీ, లైబ్రేరియన్ రమేశ్ తదితరులు ఉన్నారు.

వెనుకబాటు ఆధారంగానే రిజర్వేషన్లు

స్టేషన్ మహబూబ్‌నగర్: సమాజంలో అన్ని రంగాల్లో ముస్లింలు వెనుకబాటులో ఉన్నారని, దాని ఆధారంగానే ముస్లింలకు రిజర్వేషన్లు అమలవుతాయని, కాని కొంతమంది మతం పేరుతో అడ్డుకోవాలని చూస్తుండడం సరికాదని తెలంగాణ ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. లక్షమంది ఎన్యుమరేటర్లతో కులగణన నిర్వహించి ఆ రిపోర్టును శాసనసభలో ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా తీర్మానం చేసి రాష్ట్రంలోని బలహీనవర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ స్థానిక సంస్థల్లో అమలు కోసం సీఎం రేవంత్‌రెడ్డి దృఢ సంకల్పంతో ఉన్నారని పేర్కొన్నారు. సామాజిక, రాజకీయ, విద్యాపరంగా తెలంగాణ రాష్ట్రంలో 42 శాతం బలహీన వర్గాలు పూర్తి స్థాయిలో వెనుకబాటులో ఉన్నారని, అన్ని మతాల్లో ఉన్న ఇలాంటి వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించి న్యాయం చేసే దిశగా సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తుండడం హర్షనీయమని తెలిపారు.

కొత్త రేషన్‌కార్డులతో పేదలకు లబ్ధి



గండేడ్: కొత్త రేషన్‌కార్డుల పంపిణీతో నిరుపేదలకు ఎంతోమేలు చేకూరనుందని తహసీల్దార్ మల్లికార్జున్‌రావు, పీసీసీ మెంబరు నర్సింహారావు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీ హరిశ్చంద్రారెడ్డి, డీటీ మాధవి, ఆర్ఐ యాసిన్, జూనియర్ అసిస్టెంట్ రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలి

గండేడ్: కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పీసీసీ మెంబర్ నర్సింహారావు, పార్టీ మండలాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని జంగంరెడ్డిపల్లిలో గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కోస్గి మొగులయ్య, ఉపాధ్యక్షులుగా తిరుపతిరెడ్డి, బోయమోని చెన్నయ్య, ప్రధాన కార్యదర్శిగా పాలమూరు ఆంజనేయులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, ప్రభాకర్‌రెడ్డి, వెంకన్న, కోస్గి తిరుపతయ్య, కోస్గి వెంకటేశ్, కోస్గి శీనయ్య, భగవంతురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితుల అర్ధనగ్న ప్రదర్శన

మహబూబ్‌నగర్ రూరల్: భూ హక్కుల సాధన కోసం మహబూబ్‌నగర్ అర్బన్ మండలం ఏనుగొండ రెవెన్యూ రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 5వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో భాగంగా అధికారుల మొండి వైఖరికి నిరసనగా స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ (టీఎస్) దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ రైతులు మోకాళ్లపై నిల్చుండి అర్ధ నగ్న ప్రదర్శన చేసి నిరసన వ్యక్తం చేశారు.

వైభవంగా పోచమ్మ బోనాలు



మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని మాచన్‌పల్లి, రామచంద్రాపూర్‌లో శుక్రవారం ఆషాఢం బోనాలను వైభవంగ నిర్వహించారు. ఈ సందర్భంగా పోచమ్మ ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు బోనాలను డప్పుదరువుల మధ్య, పోతరాజుల, శివసత్తుల విన్యాసాల మధ్య అమ్మవారికి సమర్పించారు.

వాసవీమాత పల్లకీసేవ

దేవరకద్ర: మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం వాసవీమాత పల్లకీ సేవను నిర్వహించారు. అనంతరం ఆలయంలో మహిళలు సామూహిక కుంకుమార్చన, దేవీలలితా సహస్ర పారాయణం నిర్వహించారు. రాత్రివరకు అమ్మవారికి పూజలు నిర్వహించి మహామంగళ హారతి ఇచ్చారు. భక్తులకు అల్పాహారం అందజేశారు.

'అంబేడ్కర్ కళాభవన్ ఖాళీ స్థలం ఇతరులకు ఇవ్వొద్దు'

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక అంబేడ్కర్ కళాభవన్ ప్రాంగణంలోని ఖాళీ స్థలం ఇతరులకు కేటాయించొద్దని బహుజన మహనీయుల శోభాయాత్ర జిల్లా అధ్యక్షుడు పాతూరు రమేశ్ కోరారు. శుక్రవారం ఎంపీ డీకే అరుణను ఆమె నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉర్దూ ఘర్ కోసం శంకుస్థాపన చేశారని, దీనిని రద్దు చేయించాలన్నారు. సింగిరెడ్డి పరమేశ్వర్, యాంకి రమేశ్, నరేందర్ పాల్గొన్నారు.